http://www.agnidharanews.com

# అగ్నిధార

విజ్ఞాల నిప్పు కణిక

సోమవారం 28 ఏప్రిల్ 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## పాక్ గుండెల్లో గుబులు

- ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం?
- పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం
- ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి
- 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారు

## ఖజానా ఖాళీ చేసి
# మాపై నిందలా?

- కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి
- "ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి
- ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి
- పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి
- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు
- ఆపరేషన్ కగార్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి
- జాతీయ పార్టీలో జాతీయ విధానం ఉంటుంది
- దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని



హైదరాబాద్

ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. "కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## పార్టీ మార్గదర్శకాలను కట్టుబడి ఉండాలి

- పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్యతోపాటు ఆయన కేబినెట్‌లోని మరో మంత్రి కీలక వ్యాఖ్యలు
- దిద్దుబాటు చర్యలకు దిగిన కాంగ్రెస్ అధిష్టానం
- అంతేకానీ.. ఎవరి నిర్ణయాలు వారు బాహాటంగా చెప్పకూడదని సూచన
- పహల్గాం దాడి ఘటనపై భవిషత్తులో పార్టీ చేసే ప్రకటనకు నిబద్దతో కట్టుబడి ఉండాలని నాయకులను ఆదేశం

## ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారు



- కేసీఆర్‌పై మహేష్ గౌడ్ షాకింగ్ కామెంట్స్
- బీజేపీ గురించి నిన్నటి సభలో కేసీఆర్ కనీసం మాట్లాడలేదు
- కేసీఆర్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది
- అధికారం నుంచి దిగిపోయిన తర్వాత కూడా కేసీఆర్ అబద్ధాలతో మభ్యపెట్టడానికి చూస్తున్నారు

హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బీజేపీ గురించి నిన్నటి సభలో కేసీఆర్ కనీసం మాట్లాడలేదని అన్నారు. కేసీఆర్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిన్నటి సభలో కేసీఆర్ మాట్లాడిన తీరును ఖండిస్తున్నామని అన్నారు. ఆ సభలో జనాలకంటే ఎక్కువ విస్కీ బాటిల్స్ ఉన్నాయని ఎద్దేవా చేశారు. సభలో మహిళలు కనిపించలేదని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని మహేష్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. అధికారం నుంచి - మిగతా3లో



## కేసీఆర్ అబద్ధాలు చెప్పడంలో దిట్ట

- 'కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై చర్చకు వస్తారా?'
- తెలంగాణ విధ్వంసానికి మొదటి ముద్దాయి కేసీఆర్
- అధికారం పోయాక మావోయిస్టులు గుర్తుకు వచ్చారా?
- మావోయిస్టులను వెనకేసుకురావడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.
- బీజేఎప్పీ నేత మహేశ్వర్ రెడ్డి



## సంయమనం పాటించండి

- ఇండియా, పాక్‌ను కోరిన చైనా
- ఒకర్ని ఒకరు కలుసుకుని.. చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలి
- ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలి
- ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తాం
- చైనా విదేశాంగ ప్రతినిధి గువో

## ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం

తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనే

సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదే

ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్

తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, రజతోత్సవ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తితో ఆదివారం జరిగిన భారాస రజతోత్సవ సభపై భారాస నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. "భారాస రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణకు ధన్యవాదాలు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుంది. నిన్నటి సమావేశం రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమే. ఇకపై తానే ముందుండి పోరాడతానని కేసీఆర్ ప్రకటించారు. భవిష్యత్తులో



## ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలి

- మోదీతో రాజ్‌నాథ్ భేటీ..
- భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!
- సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలి
- సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటన
- తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని

## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే

- కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట
- భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారు
- "గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది
- 'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?
- ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా



నల్గొండ

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు.

"గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు - మిగతా3లో

# పార్టీ మార్గదర్శకాలను కట్టుబడి ఉండాలి

**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో విపక్ష కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమవుతోన్నాయి. ఆ నాయకుల వ్యాఖ్యల కారణంగా.. ఆ పార్టీ తీవ్ర విమర్శల ఎదుర్కొవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించింది. పార్టీ మార్గదర్శకాలను కట్టుబడి ఉండాలని నేతలకు స్పష్టం చేసింది. అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయవద్దంటూ పార్టీ నేతలకు అధిష్టానం క్లియర్ కట్‌గా సూచించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన కేబినెట్‌లోని మరో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఆ క్రమంలో ఈ దాడులపై పార్టీ వైఖరిపై సర్వత్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని నేతలకు స్పష్టం చేసింది. అంతేకానీ.. ఎవరి నిర్ణయాలు వారు బాహాటంగా చెప్పకూడదని సూచించింది. పహల్గాం దాడి ఘటనపై భవిషత్తులో పార్టీ చేసే ప్రకటనకు నిబద్ధతో కట్టుబడి ఉండాలని నాయకులను ఆదేశించింది. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఐదు నుంచి ఆరుగురు తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది మరణించారు. ఈ ఉగ్రదాడితో దేశం యావత్తు ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు ఉప్పు నిప్పుగా మారాయి.



**వివాదాస్పద వ్యాఖ్యలు**

పాకిస్తాన్‌తో యుద్ధం అవసరం లేదని, దీనికి బదులుగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. ఈ వాఖ్యలు వివాదానికి దారి తీశాయి. దీంతో ఆయన స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. అనివార్యమైతే.. పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలి

**ఢిల్లీ:** పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. ఇక.. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి ఘటనతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పాక్ జాతీయులను వారి దేశానికి పంపించింది. మరోవైపు.. నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించే పాక్.. కొన్నేళ్లుగా రూటు మార్చిందని నిఘా వర్గాలు జాతీయ మీడియాకు వెల్లడించాయి. ఆన్‌లైన్ వేదికగా కశ్మీరీ యువతను ఆకర్షించి, తమ భావజాలం వైపు మొగ్గు చూపిన వారికి సరైన పత్రాలతో వీసాలిచ్చి పాక్‌లోకి తీసుకెళ్తోందని పేర్కొన్నాయి. తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులను ఎంపిక చేసుకోవడంతో పాటు ఆయుధాలు వాడగల, దాడులు నిర్వహించగల సామర్థ్యం ఉన్నవారిని తమవైపు ఆకర్షిస్తోందని చెప్పాయి.

కొన్నేళ్లలో ఇలా 300 మందికి పైగా కశ్మీర్ యువత అధికారిక ప్రయాణ పత్రాలతో పాక్‌కు ప్రయాణించారని పలు కథనాలు వెల్లడించాయి. వీరిలో పలువురు నిషేధిత ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందుతున్నారు. తర్వాత ఉగ్రసంస్థల్లో చేరి, సరిహద్దు ద్వారా అక్రమంగా చొరబాట్లకు పాల్పడతారు. అనంతరం జమ్ముకశ్మీర్‌లోని పౌరులు, భద్రతా దళాలపై ఉగ్రదాడులు చేస్తారు. అయితే ఇలా చొరబాట్లకు పాల్పడినవారిలో 15 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. ప్రస్తుతం ఇలా శిక్షణ పొందిన తొమ్మిది మంది క్రియాశీలకంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నారని సమాచారం. వారిలో కొందరు పాకిస్తాన్‌లో ఉండి, మరికొందరు కశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు సహకారం అందిస్తున్నారు.



**పాక్‌కు సైనిక విమానాలు..**

పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా టర్కీకి చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో, భారత్ కూడా అలర్ట్ అయ్యింది.

# భారత నావికాదళంలోకి రఫేల్ యుద్ధ విమానాలు

భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్ దేశంతో భారత్ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ ఒప్పందంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ భారీ ఒప్పందం విలువ 7.6 బిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో రూ.64,000 కోట్లన్నమాట. ఒప్పందంలో భాగంగా భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు రానున్నాయి. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రాన్స్ ప్రభుత్వమే చూసుకుంటుంది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రఫేల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. శక్తివంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రఫేల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేయనున్నాయి. నాలుగేళ్లలో రఫేల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని




ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక ఒప్పందం ప్రకారం.. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి.

# పాక్ గుండెల్లో గుబులు..

**ఇంటర్నెట్‌డెస్క్:** పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతో పాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.



## తెలుగు రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నంటే..?




దేశంలో వక్ఫ్(సవరణ) చట్టం-2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. విపక్షాల అభ్యంతరాలను తోసిరాజని ఈ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు అమల్లోకి వచ్చింది. అయితే వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పలు పార్టీలతో పాటు మైనారిటీ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. మరోవైపు ఈ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఏయే రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నున్నాయే దానిపై కేంద్రం తాజాగా ప్రకటన చేసింది. దేశంలో వక్ఫ్ ఆస్తులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలున్నాయని తెలిపింది. దేశంలో వక్ఫ్‌కు సంబంధించి 8,72,352 స్థిరాస్తులు, 16,713 చరాస్తులు ఉన్నాయని ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు 994 వక్ఫ్ ఆస్తులను ఇతర అవసరాలకు కేటాయించినట్లు వివరించింది. ఉత్తరప్రదేశ్‌లో సున్నీల స్థిరాస్తులు 2,17,161, షియాల స్థిరాస్తులు 15,386 ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 14,685 స్థిరాస్తులు, 85 చరాస్తులున్నట్లు తెలిపింది. తెలంగాణలో 45,682 స్థిరాస్తులు ఉన్నట్టు ప్రకటించింది.

## సంయమనం పాటించండి



**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ దేశాలు సంయమనం పాటించాలని డ్రాగన్ దేశం చైనా కోరింది. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుతం ఇండియా, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. మరో వైపు కొన్ని రోజుల నుంచి నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాలు ఫైరింగ్‌కు పాల్పడితున్నాయి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ ప్రతినిధి గువో జాయికున్ మీడియాతో మాట్లాడుతూ ఈ అభ్యర్థన చేశారు. ఇరు దేశాలు సంయమనం పాటిస్తాయని ఆశిస్తున్నామని, ఒకర్ని ఒకరు కలుసుకుని.. చర్చల ద్వారా విబేధాలను పరిష్కరించుకోవాలని, ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నట్లు చైనా ప్రతినిధి జాయికున్ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తామని చైనా పేర్కొన్నది. ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కొత్త ఉద్రిక్తతలకు దారి తీశాయి. నాలుగు ఏళ్ల తర్వాత మళ్లీ ఇండో, పాక్ బోర్డర్ వద్ద కాల్పులు ఘటనలు జరిగాయి. ఇక పెహల్గామ్ దాడికి తామే కారణమని చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్.. ఇప్పుడు ఆ ఘటనతో తమకు బాధ్యత లేదని చెప్పుకున్నది. ఉగ్రదాడి ఘటనపై తటస్థ విచారణకు సహకరించాలని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఫరీఫ్ కోరారు. భారత్ మాత్రం ప్రతీకార చర్యగా సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇండ్లను కూల్చివేస్తోంది.

## వారి ప్రాణాలను అడ్డంపెట్టుకుని రాష్ట్ర హోదా అడగబోను : జమ్ముకశ్మీర్ సీఎం



పహల్గాంలో అతిథులను కాపాడుకోవడంలో తాను విఫలమయ్యానని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా ఆయన ప్రకటన చేశారు. అయితే ఆ 26 మంది ప్రాణాలను అడ్డంపెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని ఆయన హామీ ఇచ్చారు. జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు ఆ డిమాండ్ సరికాదని, మరేదైనా రోజు ఆ డిమాండ్ లేవనెత్తుతానని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పని చేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయి' అని అన్నారు. పహల్గాం దాడి తర్వాత తాపే ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రహోదా కోసం డిమాండ్ చేయాలని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదని చెప్పారు. గతంలో రాష్ట్రహోదా అడిగామని, భవిష్యత్తులో కూడా అడుగుతామని అన్నారు. కానీ, ఇప్పుడు 26 మంది అమాయకులు చనిపోయారని, ఇలాంటి సమయంలో రాష్ట్ర హోదా ఇవ్వండని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రజలు తమకు మద్దతిస్తే తీవ్రవాదం, ఉగ్రవాదం అంతమవుతాయని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఇది అందుకు ఆరంభమని చెప్పారు. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదని అన్నారు. తాము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలమని, కానీ, తమకు ప్రజల మద్దతు అవసరమనిని అబ్దుల్లా అసెంబ్లీలో చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా తాను వారిని కాపాడలేకపోయానని అన్నారు. కాగా ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఒక్కొక్కరిని మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది. మృతుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ ఉన్నారు.

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా?

-మొదటిపేజీ తరువాయి

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు" అని రేవంత్ హెచ్చరించారు.

**జానారెడ్డితో సీఎం భేటీ..**

జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు. ఛత్తీస్‌ఘఢ్ తెలంగాణ సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ చర్యలపై రేవంత్‌రెడ్డి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. రేవంత్‌రెడ్డితో నిన్న(ఆదివారం) శాంతి చర్చల కమిటీ భేటి అయింది. ఈ భేటిలో రేవంత్‌రెడ్డి దృష్టికి పలు కీలక విషయాలను నేతలు తీసుకువచ్చారు. సామాజిక కోణంలోనే నక్సలిజాన్ని చూస్తామని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయడానికి తమ కేబినెట్‌లోని మంత్రులతో చర్చించిన తర్వాతే ఓ నిర్ణయానికి వస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**సామాజిక అంశంగానే మావోయిస్టుల సమస్య...**

మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల అంశంగా చూడమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సామాజిక అంశంగానే మావోయిస్టుల సమస్యను చూస్తామని చెప్పారు. కాగా ఇవాళ(సోమవారం) మాజీ మంత్రి జానారెడ్డి ఇంట్లో శాంతి చర్చలపై సమావేశం జరిగింది. శాంతి చర్చలపై సీఎం రేవంత్‌రెడ్డి, జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో ఫోన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. గతంలో శాంతి చర్చల సమయంలో ఉమ్మడి ఏపీ పార్టీ ఇన్‌చార్జిగా దిగ్విజయ్ సింగ్ ఉన్నారు. ఈ సమావేశం అనంతరం శాంతి చర్చలపై మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గతంలో శాంతి చర్చలు జరిగినప్పటి విషయాలను అధ్యయనం చేస్తున్నామని అన్నారు. ఈ విషయంపై కేకే, జానారెడ్డి, దిగ్విజయ్ సింగ్‌లతో చర్చించినట్లు తెలిపారు. జాతీయ పార్టీలో జాతీయ విధానం ఉంటుందని స్పష్టం చేశారు. కగార్ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.



**ఆ తర్వాతే ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం...**

కగార్‌పై తమ పార్టీ నిర్ణయం తీసుకున్నాక ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మించిన యోధురాలు లేరని ప్రశంసించారు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఇందిరాగాంధీదేనని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతారని ఆరోపణలు చేశారు. తనకు ,రాహుల్ గాంధీ మధ్య మంచి రిలేషన్ ఉందని ఉద్ఘాటించారు. తాను ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన స్కీంలు ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవని తెలిపారు. ఎన్నికలకు చివరి 6 నెలలు తన పాలనపై చర్చ జరుగుతుందని అన్నారు. నిన్నటి వరంగల్ సభలో మాజీ సీఎం కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**కేసీఆర్‌పై ఫైర్...**

పిల్లగాళ్లు అని కేసీఆర్ అన్నారని... మరి వారినేందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ స్పీచ్‌లో పస లేదని విమర్శించారు. సంవత్సరన్నర నుంచి ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పథకాలు తీసుకు వచ్చామని... ఇప్పుడు వాటన్నింటిని సమీక్షిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాను ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను చట్టప్రకారమే నడుచుకుంటానని స్పష్టం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో తప్పు చేసిన నేతలను అరెస్ట్ చేయమని ప్రజల నుంచి తమకు డిమాండ్ వస్తోందని చెప్పారు. తాను కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానని అన్నారు. గతంలో అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పానని... అలాగే ఆయనకు ఇప్పించానని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పుకోవడంలో కొంత వెనకబడ్డామని.. స్పీడప్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని స్ట్రీమ్ లైన్ చేశామన్నారు. ఆప్షన్ లేకనే కొంతమంది అధికారులను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉన్నపళంగా తీసేస్తే పాత విషయాలన్నీ తెలిసేది ఎలా అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే

-మొదటిపేజీ తరువాయి

నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్‌ఆర్‌ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్‌ఆర్‌ఎస్పీ ఫేజ్-2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస‌ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.




**కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?: కోమటిరెడ్డి**

'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదు" అని విమర్శించారు.

# మైనంపల్లి వ్యాఖ్యలతో రాజకీయ రగడ!

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ వేదిక మరోసారి ఉత్కంఠకు కేంద్రబిందువైంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) వరంగల్‌లో నిర్వహించబోయే సభ కాంగ్రెస్ నాయకులలో ఆందోళన రేకెత్తిస్తోంది. కేసీఆర్ ఏం మాట్లాడతారు, ఎలాంటి రాజకీయ వ్యూహాలను ప్రకటిస్తారనే టెన్షన్ కాంగ్రెస్ శిబిరంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు, 'వచ్చే ఎన్నికల్లో అధికారం బీఆర్ఎస్‌దే' అని ధీమా వ్యక్తం చేస్తూ కాంగ్రెస్‌ను సవాల్ చేశారు. అదే సమయంలో, మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, 'కేసీఆర్ అందరి నెత్తిమీద రూ.2 లక్షల అప్పు చేసి ఎత్తుకొని వెళ్లిపోయాడు' అని వివాదాస్పద వ్యాఖ్య చేసి, రాజకీయ చర్చలను మరింత రసవత్తరం చేశారు.బీఆర్ఎస్ 25వ వార్షికోత్సవ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించబోయే కేసీఆర్ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక ఘట్టంగా మారింది. కేసీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తి, కొత్త హామీలతో ప్రజలను ఆకర్షించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ మౌనం వీడి, సభల ద్వారా ప్రజల్లోకి వెళ్తుండటం కాంగ్రెస్ నాయకులను కలవరపెడుతోంది. కేసీఆర్ గతంలో తన వాగ్ధాటితో ప్రజలను సమర్థవంతంగా ఆకర్షించిన చరిత్ర ఉంది.ఈ సభలో కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీల అమలులో జాప్యం, రైతు రుణమాఫీ వైఫల్యం, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌పై విమర్శలను కేసీఆర్ ప్రధాన అస్త్రాలుగా ఉపయోగించవచ్చు. బీఆర్ఎస్ నాయకు లు ఈ సభను బోనాలు, బతుకమ్మ వంటి సాంస్కృతిక ఉత్సవాలతో పోల్చుతూ, ప్రజలు భారీగా హాజరవుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ, 'కేసీఆర్ అందరి నెత్తిమీద 2 లక్షల అప్పు చేసి ఎత్తుకొని వెళ్లిపోయాడు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక భారం గురించి సూచిస్తూ చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అప్పు 2014లో 75,577 కోట్ల నుంచి?2023 నాటికి 7 లక్షల కోట్లకు పెరిగిందని ఆరోపిస్తున్నారు.మైనంపల్లి వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి మైనంపల్లి వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మైనంపల్లి వ్యాఖ్యలను సోషల్ మీడియాలో ఖండిస్తూ పోస్ట్ చేసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త మ్యాకల నర్సింగ్‌రావుపై పోలీసులు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి, దీనిపై కేటీఆర్ స్పందించి నర్సింగ్ రావుకు అండగా నిలిచారు.మరోవైపు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి, 'టెన్షన్ పడవద్దు, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది' అని ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి. హరీశ్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌పై రాజకీయ ఒత్తిడిని పెంచుతూ, బీఆర్ఎస్ ఇంకా రాజకీయంగా బలంగా ఉందని సందేశం ఇస్తున్నాయి.కేసీఆర్ సభ ద్వారా బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఆరు గ్యారంటీల విమర్శ: కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జాప్యం, రైతు రుణమాఫీలో వైఫల్యాలను బీఆర్ఎస్ ప్రధాన ఆయుధంగా ఉపయోగించనుంది.కేసీఆర్ వరంగల్ సభ తెలంగాణ రాజకీయాల్లో కొత్త రణరంగానికి నాంది పలకనుంది. మైనంపల్లి రోహిత్ వివాదాస్పద వ్యాఖ్యలు బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హరీశ్‌రావు ధీమా, కేటీఆర్ సామాజిక మాధ్యమ వ్యూహం, కేసీఆర్ రాజకీయ అనుభవంతో బీఆర్ఎస్ అధికార పీఠం వైపు అడుగులు వేస్తోంది. అదే సమయంలో, కాంగ్రెస్ ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి కొత్త వ్యూహాలను రూపొందించాల్సి ఉంది. కేసీఆర్ సభ ఒక రాజకీయ సందేశం మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ఇచ్చే భరోసా మరియు కాంగ్రెస్‌కు హెచ్చరిక కూడా. రాబోయే రోజుల్లో ఈ రాజకీయ చర్చలు ఎలాంటి మలుపు తీసుకుంటాయో చూడాలి



## తెలుగు రాష్ట్రాల్లో జియో ఎయిర్ ఫైబర్ జోరు




**హైదరాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జియో ఎయిర్ ఫైబర్ సేవల ద్వారా 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ విభాగంలో జియో తన ఆధిపత్యాన్ని మరింత బల పరుచుకుంది. భారత టెలికాం నియంత్రణ సంస్థ ఫిబ్రవరి 2025కి విడుదల చేసిన తాజా డేటా ప్రకారం.. జియో తెలుగు రాష్ట్రాల్లో 5జీ ఎఫ్‌డబ్ల్యుఏ విభాగంలో అత్యధిక మార్కెట్ షేర్‌ను సంపాదించింది. ఈ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)లో జియో ఎయిర్‌ఫైబర్ యాక్టివ్ సబ్‌స్క్రైబర్‌లు 2025 జనవరిలో 4,27,439 ఉండగా ఫిబ్రవరిలో 4,58,372 మందికి పెరిగారు. భారతీ ఎయిర్‌టెల్ సబ్‌స్క్రైబర్‌లు ఫిబ్రవరిలో 95,164 మంది మాత్రమే ఉన్నారు. అంటే.. 84% మార్కెట్ వాటా, అద్భుతమైన పనితీరుతో ఈ విభాగంలో జియో తన పోటీదారుల కంటే 5 రెట్లు ఎక్కువగా సబ్‌స్క్రైబర్ బేస్‌ను సంపాదించుకుంది. తన 5జీ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయడం, అందుబాటులో ఉన్న ప్లాన్లను అందించడం.. సులభమైన కస్టమర్ అనుభవాన్ని కల్పించడం ద్వారా జియో ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రత్యేకంగా గ్రామీణ, నగర ప్రాంతాలలో ఎన్నో సవాళ్లను అధిగమించి మారు మూల ప్రాంతాలకు సైతం హై స్పీడ్ కనెక్టివిటీని జియో అందిస్తోంది. ఆప్టికల్ ఫైబర్ (జియో ఫైబర్) విస్తరించలేని చోట్ల ప్రతి ఇల్లు మరియు చిన్న వ్యాపారానికి.. గృహ వినోదం, బ్రాడ్‌బ్యాండ్ సేవలను జియో ఎయిర్ ఫైబర్ అందుబాటులోకి తెచ్చింది. జియో ఎయిర్ ఫైబర్.. 800కి పైగా డిజిటల్ టీవీ ఛానళ్ళు, 11కి పైగా ఓటీటీ యాప్‌లు, నిరంతరాయంగా వైఫై, స్మార్ట్ హోమ్ సర్వీస్, హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో ప్రపంచ స్థాయి హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోంది. వివిధ వయస్సుల.. నేపథ్యాల నుంచి వినియోగదారులు ఇప్పుడు నిరవధిక హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ %ꢀ% ప్రపంచ స్థాయి హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను పొందుతూ డిజిటల్ ఇండియా ప్రయోజనాలను నిజంగా అనుభవిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వందలాది చిన్న, పెద్ద పట్టణాలు, వేలాది గ్రామాల్లో జియో ఎయిర్ ఫైబర్ డిజిటల్ ప్రాణశక్తిగా మారింది.

## కేసీఆర్ అబద్ధాలు చెప్పడంలో దిట్ట



**హైదరాబాద్:** తెలంగాణ విధ్వంసానికి మొదటి ముద్దాయి కేసీఆర్ అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అబద్ధాలు చెప్పడంలో దిట్టని, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలపై చర్చకు వస్తారా? అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. ఎల్కతుర్తి సభలో సెటైర్లు వేశారు మహేశ్వర్ రెడ్డి. కొండంత రాగం తీసి.. దిక్కుమాలని పాట పాడినట్లు ఉంది బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని ఎద్దేవా చేశారు. 'తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజ్ ఇవ్వలేదని నిందించారు. బీబీ నగర్ లో ఎయిమ్స్ ఎవరిచ్చారు?, కేసీఆర్ పదేళ్లపాటు మావోయిస్టులను చర్చలకు ఎందుకు పిలవలేదు. అధికారం పోయాక మావోయిస్టులు గుర్తుకు వచ్చారా?, మావోయిస్టులను వెనకేసుకురావడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. గతంలో చర్చలు జరిపినప్పుడు ఏమైంది?, మావోయిస్టులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు' అని ధ్వజమెత్తారు.

**కేసీఆర్ పగటి కలలు కంటున్నారు..**

మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. బీఆర్ఎస్ మోడల్ అంటే విధ్వంస పాలన.. ఫెయిల్యూర్ పాలన.. కుటుంబ పాలన. కుటుంబ పాలనకు కాలం చెల్లింది. తెలంగాణకు అప్పుల ఊబిలోకి కేసీఆర్ నెట్టారు. కాళేశ్వరం కట్టి తెలంగాణ ప్రజల మీద భారం మోపారు. మొసలీ కన్నీరు కార్చిన కేసీఆర్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు' అని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారు

-మొదటిపేజీ తరువాయి

దిగిపోయిన తర్వాత కూడా కేసీఆర్ అబద్ధాలతో మభ్యపెట్టడానికి చూస్తున్నారని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. అతి తక్కువ సమయంలో ప్రజాధనాన్ని దోచుకున్న కుటుంబం కేసీఆర్‌దని ఆరోపించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి కేసీఆర్‌ది కాదన్నారు. దొంగ పాసుపోర్టులు చేసుకునే కేసీఆర్‌కు కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హతే లేదని అన్నారు. కాంగ్రెస్ వల్లే కేసీఆర్ కుటుంబం ఈ స్థాయిలో ఉందని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత సోనియగాంధీ తెలంగాణ ఇవ్వటం వల్లనే కేసీఆర్ కుటుంబం కాస్ట్లీ కార్లలో తిరుగుతుందని ఆరోపించారు. కేసీఆర్ దరిద్రపు, దుష్టపాలన గురించి ప్రజలు మరిచిపోయారని అనుకున్నావా.. ఎప్పటికీ మర్చిపోరని మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు.

420 వైఫల్యాలు కేసీఆర్‌వి ఆయన చేసిన మోసాల గురించి సభలో ఎందుకు చెప్పుకోలేదని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కనీసం ఆలోచన లేకుండా కేసీఆర్ తన కుటుంబం బాగుకోసం కాళేశ్వరం కట్టారని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చిన వారికి ఒక్క పదవి ఇవ్వకపోగా ..తన కుటుంబానికే అన్ని పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్‌లో మాట్లాడుకునే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో విద్య, వైద్యం నిర్లక్ష్యం చేయడం వాస్తవం కాదా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో వడ్ల కుప్పలపై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది మర్చిపోయారా అని ప్రశ్నించారు. తాము చేసిన కులగణనపై కనీసం కేసీఆర్ నోరు విప్పలేదని మండిపడ్డారు. కవిత, హరీష్ రావుని సభలో పట్టించుకోలేదన్నారు. జన్వాడ ఫాంహౌస్ ఎవరివి.. వాటికోసం జీవోలు మార్చారని ఆరోపించారు. కేసీఆర్ పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కే పరిమితం కావాలని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు.

## ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం

-మొదటిపేజీ తరువాయి



పోరాటాలకు సిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతాం. ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం"అని కేటీఆర్ అన్నారు

# కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా

## తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, నిన్న జరిగిన బిఆర్ఎస్ సభలో మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నారు.మీరు ఎక్కడ మీరు రెచ్చగొడితే రెచ్చి పోవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు.అని నిన్న హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్ లో జరిగిన హైదరాబాద్ రేజల్యూషన్ కు అర్థం మీకు తెలుసా జస్టిస్ ఫర్ వాట్ అనే విషయంలో అంతర్జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని పొగుడుతుంటే మీకు,మీ నాయకులకు సోయి లేదు.అని డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.మీ ఒక్క స్పీచ్ కోసం ఎడ్ల బండి అని మీ పార్టీ నాయకులను హింసించి తిప్పలు పెట్టారు.తెలంగాణ ను ఎక్కడికో తీసుకపోయిన అంటుండు.7లక్షల కోట్లు ఎట్లా అప్పుచేసింది నువ్వు మర్చి పోయినా తెలంగాణ ప్రజలు ఇంకా మర్చి పోలేదు.అని ఆయన అన్నారు. కేసీఆర్ రాష్ట్టాన్ని ఆర్థిక విధ్వంసం చేసి అదో గతిపాలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి సంరక్షకుడిగా ఉండు. మీరు చేసిన పథకాలకు సమాచారం కూడా మీ దగ్గర లేదు.మేము చేస్తున్న రైతు ఋణమాపి,ఉచిత కరెంట్,ఉచిత బస్, ఉచిత గ్యాస్ ,రాజీవ్ యువ వికాసం మీ కండ్లకు కనిపించట్లేదా మీకు ఉచిత బస్ అబాసు పాలుగా కనిపిస్తుందా మీకు దమ్ముంటే ఉచిత బస్ పై,ఉచిత కరెంట్ పై,200 యూనిట్ల కరెంట్ ఫ్రీ,500లకే గ్యాస్ పై రెజల్యూషన్ చేయండి.బీసీ బిల్లు, ఎస్సి కేటగిరి,భారత దేశ చరిత్రలో ఎవరు ఇవ్వని సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా పేదలకుఇస్తున్నాం.అన్నారు.ఉద్యోగాలకోసం వెంపర్లు ఆడుతున్న నిరుద్యోగులకు 52వేల ఉద్యోగాలు ఇచ్చినం,ఇంకో 30వేల ఉద్యోగాలకోసం నోటిఫికేషన్ వేస్తున్నాం.మీ సోషల్ మీడియా, మీ ప్రపగండా టీమ్ చెప్పిందే మీకు తెలుసు.కానీ ఊర్లకు పోయి ప్రజలను అడిగితే తెలుస్తది సన్న బియ్యం ఎలాగ ఉన్నాయో అని.చట్ట సభల్లో, బీసీ లకు రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎట్లా కొట్లాడుతున్నారు.ఏండ్ల తడబడి ఎస్సి వర్గీకరణ కోసం కొట్లాడుతుంటే మీరు ఎమ్ చేసింద్రు.తెలంగాణ ప్రజలకు కావాల్సిన దాని కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అహర్నిశలు కష్ట పడుతున్నారు.మీ పార్టీని బ్రతికించుకోవడానికి బీజేపీ ని కేసీఆర్ తిట్టిండు కానీ రెండు పార్టీలు ఒక్కటే అన్నారు.

## ఆలయ ముఖ ద్వార ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వానం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రంలో శ్రీ గుండాల అంబా రామలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆలయ నిర్వాహకులు సోమవారం ఆహ్వానించారు. వెల్దండ మండల కేంద్రంలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిశారు. ఈనెల 30న నిర్వహించే ఆలయ ముఖద్వారా ప్రవేశ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రావాలని ఎమ్మెల్యేను కోరారు.అదేవిధంగా ఎంపీ మల్లు రవి పాల్గొననున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి,సంజీవ్ కుమార్ లను ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో,ముఖద్వార నిర్మాణ దాత రామస్వామి గౌడ్, అర్చకులు సంతోష్ శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండలో 30 పడకల హాస్పిటల్ ఏర్పాటుకు కృషి

**ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలో 30 పడకల హాస్పిటల్ ఏర్పాటుకు కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. కల్వకుర్తిలో 100 పడకల దవాఖాన, ఆమనగల్లో 50 పడకల దవాఖాన మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా వెల్దండలో 30 పడకల హాస్పిటల్ మంజూరుకు కృషి చేస్తానన్నారు.హాస్పిటల్లో సరిపడా వైద్యులను, సిబ్బందినినియమిస్తామన్నారు. కార్యక్రమంలో, తహసిల్దార్ కార్తీక్ కుమార్, డీటీ కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సంజీవ్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ రాజశేఖర్, కృష్ణ, రమాకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఎర్ర శీను, పుల్లయ్య, రషీద్, కృష్ణ ముదిరాజ్, శ్రీను యాదవ్, రమేష్ గౌడ్, తది తరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ స్పీచ్ కొత్త సీసాలో పాత సారా లాగ ఉసూరు మనిపించింది

**బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** స్వయం డబ్బా పరనింద తప్ప కేసీఆర్ స్పీచ్ లో ఏమీ లేదు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నారు.మీరు ఎక్కడ ఉన్నారు.మీరు రెచ్చగొడితే రెచ్చి పోవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు.అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు.నిన్న హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్ లో జరిగిన హైదరాబాద్ రేజల్యూషన్ కు అర్థం మీకు తెలుసా జస్టిస్ ఫర్ వాట్ అనే విషయంలో అంతర్జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని పొగుడుతుంటే మీకు,మీ నాయకులకు సోయి లేదు.మీ ఒక్క స్పీచ్ కోసం ఎడ్ల బండి అని మీ పార్టీ నాయకులను హింసించి తిప్పలు పెట్టారు. తెలంగాణ ను ఎక్కడికో తీసుకపోయిన అంటుండు. 7లక్షల కోట్లు ఎట్లా అప్పుచేసింది నువ్వు మర్చి పోయినా తెలంగాణ ప్రజలు ఇంకా మర్చి పోలేదు.అని ఆయన అన్నారు. కేసీఆర్ రాష్ట్టాన్ని ఆర్థిక విధ్వంసం చేసి అదో గతిపాలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి సంరక్షకుడిగా ఉండు.మీరు చేసిన పథకాలకు సమాచారం కూడా మీ దగ్గర లేదు.మేము చేస్తున్న రైతు ఋణమాపి,ఉచిత కరెంట్,ఉచిత బస్, ఉచిత గ్యాస్ ,రాజీవ్ యువ వికాసం మీ కండ్లకు కనిపించట్లేదా మీకు ఉచిత బస్ అబాసు పాలుగా కనిపిస్తుందా మీకు దమ్ముంటే ఉచిత బస్ పై,ఉచిత కరెంట్ పై,200 యూనిట్ల కరెంట్ ఫ్రీ,500లకే గ్యాస్ పై రెజల్యూషన్ చేయండి.బీసీ బిల్లు, ఎస్సి కేటగిరి,భారత దేశ చరిత్రలో ఎవరు ఇవ్వని సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా పేదలకు ఇస్తున్నాం.అన్నారు.ఉద్యోగాలకోసం వెంపర్లు ఆడుతున్న నిరుద్యోగులకు 52వేల ఉద్యోగాలు ఇచ్చినం,ఇంకో 30వేల ఉద్యోగాలకోసం నోటిఫికేషన్ వేస్తున్నాం.మీ సోషల్ మీడియా, మీ ప్రపగండా టీమ్ చెప్పిందే మీకు తెలుసు.కానీ ఊర్లకు పోయి ప్రజలను అడిగితే తెలుస్తది సన్న బియ్యం ఎలాగ ఉన్నాయో అని.చట్ట సభల్లో, బీసీ లకు రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎట్లా కొట్లాడుతున్నారు. ఏండ్ల తడబడి ఎస్సి వర్గీకరణ కోసం కొట్లాడుతుంటే మీరు ఎమ్ చేసింద్రు.తెలంగాణ ప్రజలకు కావాల్సిన దాని కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అహర్నిశలు కష్టపడుతున్నారు.మీ పార్టీని బ్రతికించుకోవడానికి బీజేపీ ని కేసీఆర్ తిట్టిండు కానీ రెండు పార్టీలు ఒక్కటే అన్నారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

**బాలోత్సవ కమిటీ చైర్మన్ చెన్నయ్య**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**టీఎస్ యుటిఎఫ్ భవనంలో బాలో త్సవ కమిటీ సమావేశం వెంకటయ్య అధ్యక్షతన జరిగినది. విజ్ఞానం వినోదం వికాసం కోసం విద్యార్థుల విజ్ఞానం పెంపొందిం చేలా మే మూడవ తేదీ నుండి 30వ తేదీ వరకు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని మంచి విజ్ఞానవంతులైన ఉపాధ్యాయులచే తెలుగు ఇంగ్లీష్ తో పాటు మ్యాథమెటిక్స్ బోధనతో పాటు పాటలు ఆటలు మొదలైన శిక్షణ నైపుణ్యం పెంపొందేలా సమ్మర్లో విద్యార్థులు కాలం వృధా చేయకుండా చెడు తిరుగుళ్ళు బారిన పడకుండా ఉండటం కోసం వారు సమాజ అభివృద్ధిలో మంచి పౌరులుగా తీర్చి దిద్దటం కోసం ఉపయోగపడేలా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ ప్రసాద్ పద్మ వెంకటయ్య, ఏపీ.మల్లయ్య కె. వెంకటేశ్వర్లు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్లో నేడు మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేయుచున్నారు అని, అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమం ఉంటుంది. కావున కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కిసాన్ సెల్ మరియు సింగల్ విండో చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీసీసీ, డిసిసి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ ఉప సర్పంచ్ లు సింగల్ విండో డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ మరియు ఎన్ ఎస్ యుఐ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాను.

## అభివృద్ధి పనులను పరిశీలించిన.ఎమ్మెల్యే



**అగ్నిధారన్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 28** చెన్నూరు ఎమ్మెల్యే డా. వివేక్ వెంకటస్వామి మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని,పలు వార్డుల్లో పర్యటించారు. ప్రతి వార్డులో రహదారుల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా,వీధి లైట్లు వంటి అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. పరిశీలన సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి,వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు ఇచ్చారు. అభివృద్ధి పనుల నాణ్యతపై అస్సలు రాజీపడరని,ప్రజలకు మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పలువురు స్థానికులు ఎమ్మెల్యేకి తమ అభ్యర్థనలు వినిపించారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ కొనసాగుతుందని,డా. వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు.చెన్నూరు ఎమ్మెల్యే డా. వివేక్ వెంకటస్వామి మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని,పలు వార్డుల్లో పర్యటించారు. ప్రతి వార్డులో రహదారుల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా,వీధి లైట్లు వంటి అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. పరిశీలన సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు ఇచ్చారు. అభివృద్ధి పనుల నాణ్యతపై అస్సలు రాజీపడరని,ప్రజలకు మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పలువురు స్థానికులు ఎమ్మెల్యే కి తమ అభ్యర్థనలు వినిపించారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ కొనసాగుతుందని డా. వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు.

# చెరువుల నిర్మాణం, పూడిక తొలగింపు




**అగ్నిధారన్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 28** సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్ "నీటి బిందువు జల సింధువు" పేరుతో ఈ నెల ప్రారంభించిన మినీ చెరువుల నిర్మాణం వేగవంతంగా సాగుతోంది. మే 15 నాటికి,సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40 చెరువుల్లో పూడిక తొలగింపు పూర్తి చేయాలని చైర్మన్ ఎన్.బలరామ్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్ని ఏరియాల జీఎంలకు, సంబంధిత పర్యావరణ, సివిల్ శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.ఇప్పటికి 20 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, పనులను మరింత వేగిర పరుస్తూ మే 15 నాటికి మొత్తం చెరువుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో సింగరేణి నిర్మించిన ఈ చెరువుల్లో నీరు పుష్కలంగా చేరే విధంగా తగు సివిల్ పనులు పూర్తి చేయాలన్నారు.రక్షణ చర్యలుగా మినీ చెరువుల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. సింగరేణి సమీప గ్రామాలలో..భూగర్భ జలాలు పెంచడం కోసం తీసుకున్న ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రతి ఏరియా జీఎం ప్రత్యేక శ్రద్ధతో విజయవంతం చేయాలని సూచించారు. తొలుత 50 మినీ చెరువులు నిర్మించాలని భావించినప్పటికీ,గనుల ప్రాంతంలో ఉన్న అవకాశాలను పరిగణలోకి తీసుకొని వీటి సంఖ్యను 62 కు పెంచారు.అలాగే ఇప్పటికే ఉన్న 40 చెరువుల్లో నీటి సామర్థ్యం పెంపుదలకు పూడిక తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించారు. సింగరేణిలో గతంలో కేవలం అక్కడక్కడ చెరువుల పూడికను కొన్ని ఏరియాలో తీసిన దాఖలాలు ఉన్నాయి కానీ ఈ విధంగా పెద్ద ఎత్తున చెరువుల నిర్మాణాన్ని చేపట్టడం గతంలో ఎన్నడూ జరగలేదు.ఈ చెరువుల నిర్మాణం సింగరేణి సమీప ప్రాంత భూగర్భ జలాల పెంపుదలకు ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉంది.

**ఏరియాల వారీగా సింగరేణి కొత్తగా చేపడుతున్న 62 మినీ చెరువుల వివరాలు.**

మందమర్రి లో 10 మినీ చెరువులు,కొత్తగూడెంలో 8 భూపాలపల్లిలో, రామగుండం-1లో, రామగుండం-2లో ఇల్లందు మణుగూరు, శ్రీరాంపూర్,బెల్లంపల్లి, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఏరియాకు 5 మినీ చెరువుల చొప్పున, రామగుండం-3 ఏరియాలో 4 మినీ చెరువులను సింగరేణి యాజమాన్యం నిర్మిస్తోంది.సోమవారం నాటి సమీక్ష సమావేశం చైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ తో పాటుకొత్తగూడెం కార్పొరేట్ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ మరియు కొప్పుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ కార్యాలయం నుంచి సింగరేణి అటవీ శాఖ అడ్వైజర్,మోహన్ పరిగెన్, పర్యావరణ శాఖ జనరల్ మేనేజర్ సైదులు,ఏరియాల నుండి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు,పర్యావరణ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో వట్టెల మాసమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతురాలి కుటుంబం పట్ల సానుభూతి తెలుపుతూ వారి కుటుంబనికి 3000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి ,పార్టీ గ్రామ గ్రామ మాజీ ఎంపిటిసి తిక్కల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకి కృష్ణ, జంగయ్య, శ్రావణ్ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నరసింహ జంగిలి మల్లేశు, యువజన కాంగ్రెస్ నాయకుడు కాకి శివ వెంకటేష్ హరీష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు, గంజాయి,డ్రగ్స్ నిర్మూలన అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కణ

**మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూల అందరి సామాజిక బాధ్యత**

**డ్రగ్స్, గంజాయి మత్తుతో జీవితం నాశనం అవుతుంది**

**మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగించిన, రవాణా చేసిన శిక్షలు తప్పవు ఎస్పీరావులగిరిధర్**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** గంజాయి, మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నిర్మూలన అందరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్ గంజాయి మత్తు తో జీవితం నాశనం అవుతుందని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తి రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని నిషేధిస్తూ డ్రగ్స్ నిర్మూలనలో బాగంగా ఏర్పాటు చేసిన అవగాహన పోస్టర్ ను జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి వల్ల సమాజంలో యువ శక్తి విచ్ఛిన్నం అవుతుందని డ్రగ్స్ మత్తులో దాడులు, నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజలు డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశభవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నదని విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంలో శక్తి తగ్గుతుందని మంచి భవిష్యత్తును కోల్పోతారని, అదోవ్యసనంగా మారుతుందని తెలిపారు. వీటిని వినియోగించే వారికి సమాజంలో చెడ్డపేరు వస్తుందని అన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి మాదకద్రవ్యాల వల్ల అన్ని కోల్పోతారు అన్నారు, ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన వారి గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము వారిలో మార్పునకు కృషి చేస్తామని అన్నారు. వనపర్తి జిల్లాలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం సంయుక్తంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీరాములు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి , జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, డా ఏ. శ్రీనివాసులు, వనపర్తి సీఐ కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ అమర్, పాలకవర్గ సభ్యులు, అహమద్, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్, ఆర్. రాజేందర్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూపర్వైజర్, మహేష్,రెడ్ క్రాస్ సభ్యులు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా జన్మదిన వేడుక



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో హుల్గెరా గ్రామ యువ నాయకులు దత్తు పాటిల్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని దీవించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చేవెళ్ల విట్టల్ మండల పార్టీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు మల్లేష్ కురుమ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి మాజీ వరం వైస్ చైర్మన్ తుకారాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీమ్ పటేల్ యూత్ ప్రెసిడెంట్ అంజి వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సతీమణి



**అగ్నిధార న్యూస్ (రామగుండం):** పాలకుర్తి మండలంలోని బసంనగర్ ఎయిర్పోర్ట్ పరిధిలో ఉన్న ఐకెపి కేంద్రాన్ని సోమవారం నాడు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీ మణి మనాలి ఠాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఐకెపి కేంద్రంలోని కార్యకలాపాలలో నిమగ్నమైన రైతులతో పాటు, హమాలీ కూలీలతో ఆత్మీయంగా మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ పంటలు మార్కెట్‌కు చేరే ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్ళను వివరించగా, కూలీలు తమ జీవన విధానానికి సంబంధించి ఎదుర్కొంటున్న కష్టాలను వివరించారు. మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, "రైతుల పక్షాన నిలబడటం మా బాధ్యత. వారి అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం కోసం రాజ్ ఠాకూర్ స్వయంగా ప్రభుత్వ అధికారులతో చర్చిస్తారు," అని హామీ ఇచ్చారు. కూలీల హక్కులు, మౌలిక వసతుల విషయంలో సత్వర పరిష్కారాలకు కృషి చేస్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ సురభి ఆదేశం**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్య మంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అనంతరం రెడ్ క్రాస్ ద్వారా రూపొందించిన యాంటీ డ్రగ్స్ అవగాహన గోడ పత్రికను అదనపు కలెక్టర్, వైద్య అధికారులతో కలిసి విడుదల చేశారు.కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేరు సంఘం ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు ఘన నివాళి



అగ్ని ధార న్యూస్,( రామగుండం): జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశ ప్రజల హృదయాన్ని కలిచివేసిందని, మానవత్వం లేకుండా తీవ్రవాదులు చేసిన దాడి చాలా హేయమైన చర్య. పర్యాటకులపై జరిగిన ఈ అమానుష దాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం బాధాకరమని దీనిని ఖండిస్తూ శ్రీ రామ మేర భజన మందిరం ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో 100మంది మేర కుల బంధువులు పిల్లలతో సహా హాజరై మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమములో సిఐ గూడురు సతీష్ కుమార్ మేర సంగం జే ఎ సి వ్యవస్థాపకులు సంఘ వెంకటాజం.రామగిరి రాజు రాయబారపు సంతోష్ .కుమార్ కీర్తి జయంత్. జర్నలిస్టు గుడురు లవన్ కుమార్ సోమ కేదార్ మునిగాలా శ్యామ్ ప్రసాద్ రాయబారపు కళ్యాణ్ చక్రవర్తి సోమ లతమడిశెట్టి నరహరి సోమ పుల్లయ్య రామగిరి జ్యోతి .సోమ శ్రీదేవి గూడూరు వెంకటమ్మ మడిశెట్టి మాధవి మడిశెట్టి రవళి పొడిశెట్టి నీరజ గూడూరు ఓంప్రకాష్ బొమ్మిదేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

**నిషేధిత గంజాయి పై ఉక్కుపాదం**

**గోదావరిఖని ఏసిపి మడత రమేష్**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** ప్రభుత్వ నిషేధిత గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని ఏసీపి మడత రమేష్ తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ శివారులోని రాజేందర్ నగర వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలింపుకు సిద్ధంగా ఉన్న వారిని పక్క సమాచారం మేరకు కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ దాడి చేసి పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని చింతూరు మండల కేంద్రం చెందిన సవలం మల్లేష్ జగిత్యాల జిల్లా గుడిసెలపేట చెందిన అలక సందీప్, మద్దెల హరీష్ లు ద్విచక్ర వాహనంపై రెండు కిలోల గంజాయిని ఓపెన్ ప్లాట్స్ వద్ద తరలించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పక్క సమాచారంతో ఎస్సై కొట్టే ప్రసాద్ తన సిబ్బందితో వెళ్లి ముగ్గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు కిలోల గంజాయి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. అలాగే తమ తల్లిదండ్రులు పిల్లలను గంజాయికి మత్తుకు బానిస కాకుండా చూసుకునే బాధ్యత వారి కుటుంబ సభ్యులపై ఉందని ఏసీపి రమేష్ అన్నారు. కోల్ బెల్ట్ ప్రాంతంలో నిషేధిత గంజాయి పై ఉక్కు పాదం మోపడం జరుగుతోందని ఎప్పటికప్పుడు బస్టాండ్లలో రైల్వేస్టేషన్లో నిఘా పెట్టి అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడం జరుగుతుందని ఎసిపి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి అమ్మితే తమకు సమాచారం ఇస్తే తమ పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూ టౌన్ సిఐ నక్క ప్రసాద్ రావు, కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్, ఏఎస్సై బాలాజీ నాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మందమర్రి ఏరియా ను సందర్శించిన సి.ఎం.ఓ కిరణ్ రాజ్ కుమార్



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 28** నూతనంగా సి.ఎం.ఓ, కార్పొరేట్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన,తర్వాత మొదటిసారి ఏరియాను సందర్శించిన సందర్భంగా. ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ మొక్కను అందజేసి,శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో.. ఎస్.ఓ.టు జి.ఎ.విజయ ప్రసాద్,ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం వెంకటరమణ,పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్,ఎస్.సురేష్ డీజీఎం (ఈ ఏం) ఏరియా స్టోర్స్.ఐ.టీ సీనియర్ ప్రోగ్రామర్ రవి,నరేష్ డివై ఎస్.ఇ ఏరియా వర్క్ షాప్ పాల్గొన్నారు.

## శ్రీ బీరప్పస్వామి జాతర




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల అల్లాపూర్ గ్రామంలో మే 1 వ తేదీ నుండి 8 వరకు శ్రీ బీరప్ప స్వామి జాతర మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయని కురుమ సంఘం సభ్యులు గ్రామ పెద్దలు తెలిపారు. 1వ తేదీన మంద పోచమ్మకు చేయుట గుడి మై లలు తీయుట, 2న గంగకు పోవుట, 3న అన్నదాన కార్యక్రమం బోనాలు తీయుట, 4న బీరప్ప స్వామి కామరాతి దేవతల కళ్యాణ మహోత్సవం అన్నదాన కార్యక్రమం యాటలు కోయుట, 5న నాగవల్లి గొల్ల బీర్లోళ్ళ వేషధారణ, 6 న గొర్రె పిల్లల కళ్యాణం, 7న ఎల్లమ్మ కథ, 8న కడప కడుగుట ఇతర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు

## ప్రచాంతంగా ముగిసిన ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రములో గల ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది అని పరీక్షల నిర్వహణ అధికారి కైరత్ అలీ అన్నారు ఉదయం జరిగిన ఆరవ తరగతికి 117మంది విద్యార్థులకు 106మంది విద్యార్థులు అనగా తొంబై శాతం, మధ్యాహ్నం జరిగిన ఏడవ తరగతి కీ 26 మంది కీ 21మందికి ఎనిమిదవతరగతికి 29మందికి 27మంది, తొమ్మిదవ తరగతికి 14మందికి 12మంది హాజరు అయ్యారు

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన షెడ్యూల్:



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) : ఏప్రిల్ 29 ఉ. 10.00 గం :**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ,మార్కండేయ కాలనీ శాఖ, రమేష్ నగర్ శాఖ.లక్ష్మీ నగర్ శాఖ ఏప్రిల్ 30 ఉ. 10.00 గం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ , గోదావరిఖని శాఖ, మేడిపల్లి చౌరస్తా శాఖ బ్యాంక్ ఆఫ్ ఇండియా జ్యోతి నగర్ శాఖ హెచ్ డి ఎఫ్ సి రామగుండం శాఖఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ , గోదావరిఖని శాఖ ఇండియన్ బ్యాంక్, ఐ సి ఐ సి సి బ్యాంక్, కె డి సి సి యాక్సిస్ బ్యాంక్ తో పాటు మిగిలిన అన్ని ఇతర బ్యాంకు శాఖలు. అభ్యర్థులు ఒరిజినల్ పాన్ బ్యాంక్ పాస్ బుక్ ఆధార్, ఆహార భద్రత కార్డు/ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో షెడ్యూలు ప్రకారం హాజరు కావాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), కమీషనర్(ఎఫ్ ఎ సి ) జె.అరుణ శ్రీ ఒక ప్రకటన లో కోరారు.

http://www.agnidharanews.com
అగ్నిధార

# సామాజిక సేవలకు దార మధు కు ఉగాది 2025 జాతీయ పురస్కారం

**మానవత వెలుగు అవార్డు**

**అందుకున్న ధార మధు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** రామగుండం కార్పొరేషన్ లోని గోదావరిఖని మార్కండేయ కాలనిలో ఆదిత్య రేసిడెన్సి బ్యాంకెట్ హాల్లో, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రలలోని పలు రంగాల వారికి ఆదివారం సాయంత్రం 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగినది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం, ఇద్దులాపూర్ గ్రామంకు చెందిన తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ టి జి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ దార మొండయ్య (మధు కు) జాతీయ పురస్కారాల మహోత్సవ సన్మాన పత్రం మరియు సామాజిక సేవా రంగంలో జాతీయ గౌరవ పురస్కారం మానవత వెలుగు అవార్డు తో సత్కరించడం జరిగింది. సేవా రంగంలో కృషి చేసినందుకు ధార మధు ని హృదయ పూర్వకంగా అభినందిస్తు, ఈ కృషి నిరంతరం కొనసాగాలని ఇంకా ఎన్నో అద్భుతాలను ఆకాంక్షిస్తు, విజయాలను సాధించాలని అన్నారు. కార్యక్రమానికి గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు



పెద్దంపేట శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లయన్ డాక్టర్ సిహెచ్ కిషన్ రావు, సలహాదారులు లయన్ డాక్టర్, కె రాజేందర్, సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూము నర్సయ్య, స్త్రీ వైద్యురాలు లయన్ డాక్టర్ లక్ష్మి వాణి లు హాజరై అవార్డులను ప్రధానం చేయడం జరిగింది. అనంతరం సంస్థ బాధ్యులు మాట్లాడుతూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ గత 16 సంవత్సరాలుగా దాతల సహాకారంతో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను చేస్తు రావడం జరిగిందని తెలిపారు.

# మేడే ను పోరాట దీక్ష దినంగా నిర్వహించాలి

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

**అగ్ని ధార న్యూస్(రామగుండం),** ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1న మేడే నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ విజ్ఞప్తి చేశారు.సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని సిఐటియు కార్యాలయంలో కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 18 గంటలు పని చేసే విధానాన్ని వ్యతిరేకిస్తూ రోజుకు 8 గంటల పని దినం కోసం,1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో హె మార్కెట్ వద్ద సమ్మెలో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులపై అక్కడి ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం కాల్పులు జరపడంతో అనేక మంది కార్మిక నాయకులు అమరులయ్యారని,ఆ రక్తం మడుగులో తడిసిన కార్మికుని అంగిని పైకి ఎగరేయడంతో అదే ఎర్రజెండా గా ఆవిర్భవించిందన్నారు.అక్కడ ఎగిరిన ఎర్ర జెండా ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల,సౌకర్యాల,చట్టాల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి కష్టజీవులకు అండగా ఉందన్నారు.మేడేను ఉత్సవంగా కాకుండా పోరాట దినంగా నిర్వహించాలన్నారు.చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాట స్ఫూర్తితో అనేక దేశాల్లో కార్మిక వర్గం ఎర్ర జెండా అండతో తిరుగుబాటు చేసిందని, భారత్ లో కార్మిక వర్గం స్వాతంత్యా నికి ముందు తర్వాత అనేక పోరాటాలు,సమ్మెలు,త్యాగాలు, ఉద్యమాలు నిర్వ




హించి 29 కార్మిక చట్టాలను సాధించిందన్నారు.మే డే రోజున ప్రతి గ్రామ వార్డు బస్తి స్థాయిలో మేడే జెండాలు ఆవిష్కరించాలని,మండల,పట్టణ కేంద్రాల్లో ప్రదర్శనలు సభలు నిర్వహించి,చికాగో అమరుల స్ఫూర్తితో వర్గ పోరాటాలకు సన్నద్ధం కావాలని,ఎర్రజెండా ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా మేడే నిర్వహించాలని పిలుపునిచ్చారు.అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి,కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు,ఉపాధ్యక్షులు ఎన్.బిక్షపతి,యం.శ్రీనివాస్,ఎం.రామాచారి,సిపెల్లి రవీందర్ పాల్గొన్నారు.

# భద్రాద్రిలో యదేచ్ఛగా ఆక్రమణలు

**ఖమ్మం :** ఇప్పటి వరకు పట్టణాలకు, సమీప మండలాలకు పరిమితమైన భూకబ్జాలు తాజాగా ఏజెన్సీ గ్రామాలకు పాకింది. పాత తేదీలతో నకిలీ నాన్ జుడిషియల్ స్టాం ప్స్, ఫోర్జరీ సంతకాలు చేసి మరణించిన వారి పేరుతో ఉన్న భూములను కొనుగోలు చేసినట్లు భూ భకాసురులు భూకబ్జాలకు తెర లేపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గంగారం రెవెన్యూ గ్రామ పరిధిలో దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములపై కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది.పాల్వంచకు చెంది న కేటీపీఎస్ డి ఈ స్థాయి అధికారితో పాటు స్థానికులు ఇద్దరు ఈ కబ్జాకు శ్రీకారం చుట్టారని ఆరోపణలు వెలబడుతున్నాయి. దీంతో బాధితులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే సంపత్ నగర్ కు చెందిన ఓ వృ ద్ధుడి భూమిపై కబ్జాదారులు కన్నేసి గంగా రం రెవెన్యూ పరిధిలోని సంపత్ నగర్ గ్రామం లో ఉన్న భూములను తప్పుడు పత్రాలతో కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించారని తెలుస్తోంది. 1970 కంటే ముందు నుంచి ఇక్కడ రైతులు వారి భూ ముల్లో సాగు చేసుకుంటున్నారు.రెవెన్యూ రికార్డులో రైతుల పేరు నమోదయి ఉంది. అట్టి భూ ములపై నకిలీ పత్రాలు సృష్టించి కేటీపీఎస్ లో డి ఈ గా విధులు నిర్వహిస్తు న్న అధికారి భూములను కొనుగోలు చేసినట్టు పాత తేదీల్లో తప్పుడు కాగితాలు సృ ష్టించి, అసలు రైతులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. అతనికి ఓ మా జీ రౌడీ షీటర్ , స్థానికులు ఒకరు పూర్తి సహా య సహకారాలు అందిస్తున్నట్లు సమాచా రం.ఏజెన్సీ చట్టాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ రికార్డుల్లో ఎలాంటి ఆధారాలు లేకున్నా, మరణించిన గిరిజనుల పేర్ల మీద పాత తేదీల పై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థానిక రైతులను బెదిరిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలు వెలబడుతున్నాయి. స్థానికంగా ఉండే ఓ రౌడీ షీటర్ ప్రణాళికలు రూపొందించి ఈ తంతు కొనసాగిస్తున్నాడని సమా చారం.చనిపోయిన వారి పేరుతో ఉన్న భూములను కొనుగోలు చేసినట్లు నకిలీ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లను, పాత తేదీలతో సృష్టించి కేటీపీఎస్ డి ఈ స్థాయి అధికారి కొనుగోలు చేసినట్లు పత్రాలను త యారుచేసి,



అధికారులను పక్కతో పట్టిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 200 ఎకరాల కు పైగా ఇలాంటి నకిలీ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లతో కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గంగారం రెవెన్యూ పరిధిలోని సంపత్ నగర్ గ్రామంలో 50 సంవత్సరాల నుంచి అబ్బినేని సాంబశివరావు అనే వృద్ధ రైతు కు 12.08 ఎకరాల వ్యవసాయ భూమి సా గు చేసుకుంటున్నాడు. 1968 లో కొండపల్లి గోపాల్ రావు అనే వ్యక్తి నుంచి సాంబశివరావు కొనుగోలు చేసినట్లు పహనీలు ఉన్నా యి. అప్పటి నుంచి రెవెన్యూ రికార్డులో సాంబశివరావు పేరు కొనసాగుతోంది.ఆ భూమిపై కబ్జాకోరుల ముఠా కన్ను పడింది. మరణించిన రైతుల నుంచి కేటీపీఎస్ లో డీగా పనిచేస్తున్న అధికారి నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేసినట్లు రికార్డులను తయారు చేశారు. 17 సంవత్సరాల క్రితం ఆ భూమి అమ్మకాలు, కొనుగోలు జరిగినట్లు రికార్డులు తయారు చేశారు.2008 సంవత్సరములో రెడ్డి రామయ్య నుంచి తాటి లక్ష్మయ్య కొనుగోలు చేసినట్టు ఒక నకిలీ స్టాంప్ పేపర్ పై ఫోర్జరీ సంతకాలు చేసి తప్పుడు పత్రాలు సిద్ధం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంప్ పేపర్లను కొనుగోలు చేసినట్లు చూపించారు. అట్టి భూమిని 2017 లో కే టి పి ఎస్ డి ఈ కి అమ్మినట్లు మరొక నకిలీ పత్రాలను సృష్టించారు. రెడ్డి రామయ్య, తాటి లక్ష్మయ్యలు గతంలో ఎప్పు డో మరణించారు. వారి పేరుతో గుడివాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు సృష్టించడంతో కబ్జా కోరుల బండారం బహిర్గతమైంది. అసలు రైతు అబ్బినేని సాంబశివరావు, మనవడు స మాచార హక్కు చట్టం ద్వారా గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ను సమాచారం కోరగా, సదరు స్టాంప్ పేపర్ తమ కార్యాలయం పరిధిలోనిది కాదని, నకిలీదని సమాచారం ఇవ్వడం తో వాస్తవం వెలుగులోకి వచ్చింది.ఇదే తరహాలో సుమారు 200 ఎకరాలకు పైబడి తప్పుడు పత్రాలతో కబ్జాకోరులు భూముల ఆక్రమణకు పాల్పడుతున్నట్లు తేటతెలమైం ది. తన దగ్గర ఉన్న ఆధారాలతో సాంబశివరావు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జిల్లాస్థాయి అధికారులు కబ్జాకోరుల ఆగడాలను అరికట్టి తమ భూములకు రక్షణ కల్పించాలని గంగారం రెవెన్యూ పరిధిలోని రైతులు కోరుతున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

**అగ్నిధార న్యూస్,( రామగుండం)** రామగుండం కార్పొరేషన్ మూడవ డివిజన్లో నెలకొని ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మూడవ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేష్ ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈదునూరి మల్లేష్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూడవ డివిజన్ ఎన్ టి పి సి ప్రభావిత ప్రాంతాలగా గుర్తింపబడ్డ బుచ్చయ్యపల్లి దుర్గయ్య పల్లి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి చూసుకో లేదని తెలిపారు. జంగాలపల్లి గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ కి చుట్టూ పడారి గోడ ఏర్పాటు చేయాలని, మంచినీళ్ల ఫెసిలిటీ కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని తెలిపారు. జంగాలపల్లి గ్రామస్తుల కోసం గంగమ్మ తల్లి దేవాలయం నిర్మించాలని, అదేవిధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమిటీ హాల్ నిర్మించాలని కోరారు. గంగపుత్ర, ముదిరాజు కులస్తులకు ఫిషరీ టెక్నాలజీ మరియు దానికి సంబంధించిన అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, యాదవ కులస్తుల కొరకు పశు రక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రత్యేకంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, రోడ్లు, సోలార్ లైట్లు ,ఏర్పాటు చేయాలని కోరారు. జంగాలపల్లి సుందరి కరణ కోసం పార్క్ కట్టించాలని కోరారు. ఎన్ టి వి సి ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపబడ్డ దుర్గ పల్లి బుచ్చయ్య పల్లి , అన్నపూర్ణ కాలనీ లో ఎన్టిపిసి పరిధిలో అంబేద్కర్ భవన్ సంబంధిత రేకుల షెడ్డు అంబేద్కర్ భవన్ ముందు చేయాలన్నారు. ప్రతి వాడలో సిఎస్ఆర్ సిడి ద్వారా ప్రతి వాడలో చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టాలని కోరారు. సి ఎస్ ఆర్ సి డి ద్వారా గత పది సంవత్సరాల కిందట అన్నపూర్ణ కాలనీ మరియు కృష్ణ నగర్ కి వెళ్లడానికి బ్రిడ్జి నిర్వహించారు రోడ్డు సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు విపరీతంగా కొడుతున్నాయి కాబట్టి నీళ్లు లేక మేడిపల్లి సెంటర్లో ప్రజలు విలవిలలాడుతున్నారు కావున ఫ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## తాలుపేరుతో వరి ధాన్యం కట్టింగ్

**కటింగ్ లేనిదే వడ్లు తీసుకొం...!**

**మిల్లర్లకు తొత్తుగా వ్యవహరిస్తున్న వైనం...!**



**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులను అరిగోశ పెడుతున్నారని వాపోతున్నారు. ఐకెపి సెంటర్లో వడ్లు 41 నుండి 43 కిలోలు ఇస్తేనే వడ్లు తీసుకుంటామని కడకండిగా చెప్తున్నారు అని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లు మంచిగా లేవు వడ్లల్లో తాలు శాతం ఎక్కువ ఉన్నందున మీ వడ్లు తీసుకో అని అంటున్నారు అని తెలిపారు. ఏ గ్రేడ్ కింద పోయే వడ్లను కామన్ కింద అమ్మిన వద్దు అంటున్నారు. మిల్లర్లకు బయటి జిల్లా నుంచి వడ్లు వస్తున్నాయని ధీమతో మేము ఎంత కటింగ్ పెట్టినా మీరు దానికి ఒప్పందమై ఇస్తేనే తీసుకుంటాం లేకపోతే మీ సెంటర్ నుంచి వడ్లు మాకు వద్దని అంటున్నారు అని రైతులు వాపోతున్నారు. ఈ సమస్య ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ రైతులకు న్యాయం కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిపోయేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభ

**విజయవంతం చేసినవారికి కృతజ్ఞతలు**

**రామగుండం కార్పొరేషన్ లో గులాబీ జెండా ఎగురవేస్తాం**

**బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి**



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కుంభమేళ తరహాలో జరిగిందని,చరిత్రలో నిలిచిపోయేలా ఉందని మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దపల్లి జిల్లా కోరుకంటి చందర్ తెలిపారు.సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంట ఉన్నారని ఎల్కతుర్తి బిఆర్ఎస్ రజతోత్చవ సభ నిరూపించిందన్నారు.రామగుండం నియోజకవర్గం ఒక ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిందని,ఉద్యమ సమయంలో ఏ పిలుపిచ్చినా ప్రభంజనంలా తరలేవారని,రజతోత్చవ సభకు 5వేల మంది జనం ఈ ప్రాంతం నుండి తరలివెళ్ళి విజయవంతం చేశారని,వారిని సభకు తరలించడంలో కష్టించిన గులాబీ సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు.రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేసే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పుచేసామన్న భావనలో రాష్ట్ర ప్రజానీకం ఉందని, మళ్ళీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.విలేఖరుల ఈ సమావేశం లో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు,గోపు ఐలయ్య యాదవ్,కుమ్మరి శ్రీనివాస్,పాముకుంట్ల భాస్కర్,కల్వచర్ల కృష్ణవేణి,బోడ్డు రవీందర్ ముద్దసాని సంధ్యారెడ్డి,నీరటి శ్రీనివాస్,ఎన్.మారుతి,అచ్చే వేణు,మెతుకు దేవరాజు నూతి తిరుపతి సట్టు శ్రీనివాస్,బుర్ర వెంకన్న,ఆవునూరి వెంకటేష్,కర్రీ ఓదేలు పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్ ఘటననపై స్పందించిన ఎమ్మెల్యే

**నల్గొండ :** దామరచర్ల (మం) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రమాదంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పందించారు. ప్లాంట్ ను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై అధికారులతో ఆరాతీసారు. యూనిట్ వన్ లోని బాయిలర్ వద్ద గ్యాస్ కట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన మూడు బాయిలర్లు రన్ చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. త్వరితగతన ప్రమాదానికి గురైన బాయిలర్ గ్యాస్ కట్ ను రిపేరు చేయాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే. బాయిలర్ రిపేరు చేసి 24 గంటల్లోపు రన్నింగ్ లోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు. జరిగింది చిన్న ప్రమాదం ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు.



# పెళ్లెప్పుడో చెప్పిన విశ్వక్ సేన్.. వెయిటింగ్ అంటున్న ఫ్యాన్స్

టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఇతనిని చూస్తే యాటిట్యూడ్ ఎక్కువ అని చాలా మంది అనుకుంటారు. పలు వివాదాలలో కూడా విశ్వక్ యాటిట్యూడ్ చూపించాడు అని కొందరు చెప్పుకొస్తుంటారు. అయితే మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు. లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హాజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. 'అర్జున్ సర్కార్, విక్రమ్‌లో లేని క్వాలిటీ ఏంటి అని మీరు అనుకుంటున్నారు.' అన్న ప్రశ్నకు విశ్వక్.. 'ఫిట్టింగ్ ఇది. ఇద్దరిలో ఉండే ప్రశాంతత. కామ్ నెస్ అంటూ సమాధానం ఇచ్చారు. ఈ మధ్యే నా వయస్సు 30కి చేరుకుందని , ఇప్పుడు కాస్త స్పీడ్ తగ్గించి కూల్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను. ఊరికే అటు ఇటు పరిగెడుతూ ఉన్నా.. ఇప్పటి నుంచి అది తగ్గిపోతుందని అని చెప్పారు. నాని, అడివి శేష్ నుంచి కూల్ గా ఉండటం నేర్చుకుంటున్నాను అని చెప్పారు. ఇక మీరు పెళ్లెప్పుడు చేసుకోవాలనుకుంటున్నారు?' అని సుమ అడగ్గా.. మా అమ్మకు సంబంధాలు చూడమని మొన్ననే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాను. సో.. ఎప్పుడు దొరికితే అప్పుడు చేసుకుంటాను అని విశ్వక్ చెప్పడంతో త్వరలో మనోడు కూడా పప్పు అన్నం పెట్టించబోతున్నాడని ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు.



# రొమాంటిక్ కామెడీగా 'సింగిల్'

తెలుగు హీరోల్లో శ్రీ విష్ణు కాస్త డిఫరెంట్ మూవీస్ చేస్తూ అలరిస్తుంటాడు. గతేడాది 'స్వాగ్' అనే ప్రయోగాత్మక సినిమా చేశాడు. కానీ ఇది జనాలకు నచ్చలేదు. దీంతో తనకు అచ్చొచ్చిన కామెడీనే మళ్లీ నమ్ముకున్నాడు. అలా చేసిన మూవీ 'సింగిల్'. మే 9న రిలీజ్ కాబోతున్న ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ సినిమా ట్రైలర్ ని తాజాగా రిలీజ్ చేశారు. దీనిబట్టి చూస్తే.. సింగిల్ గా ఉండే శ్రీ విష్ణు జీవితంలోకి ఇద్దరమ్మాయిలు వస్తారు. తర్వాత వాళ్లతో ప్రేమ, రొమాన్స్, గొడవలు.. చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది.ల ట్రైలర్ లో కామెడీ బాగుంది. జోకులు బాగానే పేలాయి. చూస్తుంటే శ్రీ విష్ణు మరో హిట్ కొడతాడేమో అనిపిస్తుంది. రీసెంట్ గా వైరల్ అయిన బుల్లిరాజు అలియాస్ రేవంత్ ఈ సినిమాలోనూ నటించాడు. గీతా ఆర్ట్స్ సంస్థ దీన్ని నిర్మించగా.. కార్తీక్ రాజ్ దర్శకుడు. కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లు.



# మరోసారి వార్తలలోకి రాజమౌళి మహాభారతం.. ఆ ముగ్గురు హీరోలు ఫిక్స్ అయినట్టేనా?

భారతీయ సినిమా ముఖ చిత్రాన్ని మార్చేసిన టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి. ఆయన కెరీర్‌లో ఒక్కటంటే ఒక్క ఫ్లాప్ లేదు. తీసిన ప్రతి సినిమా సెన్సేషన్. సినిమా సినిమాకి అంచనాలని పెంచేస్తూ హాలీవుడ్ రేంజ్‌లో చిత్రాలు తెరకెక్కిస్తున్నారు జక్కన్న. చివరిగా రాజమౌళి తెరకెక్కించిన ఆర్ఆర్ఆర్ చిత్రం తెలుగు సినిమాని ప్రపంచంలో ఇంకా పై స్థాయికి తీసుకెళ్లింది అని చెప్పవచ్చు. ప్రస్తుతం రాజమౌళి.. మహేష్ బాబుతో కలిసి క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ మూవీ హాలీవుడ్ స్టాండర్డ్స్‌లో ఉంటుందని తెలుస్తుంది. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి కాగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ స్టార్ట్ చేయనున్నాడు. అయితే రాజమౌళి ఎన్ని చిత్రాలు చేసిన ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ ఒకటి ఉంది. అది మరెదో కాదు మహాభారతం. ఎన్నో ఏళ్ళ క్రితమే రాజమౌళి మహాభారత కావ్యాన్ని తెరకెక్కించడం తన జీవిత లక్ష్యం అని చెప్పుకొచ్చారు. ఇది చేయడానికి చాలా సమయం పడుతుందనన్నారు. జక్కన్నకి మన పురాణాలు, ఇతిహాసాలు పట్ల ఉన్న గ్రిప్ ఉండడంతో మహాభారతాన్ని చాలా అద్భుతంగా తెరకెక్కిస్తాడని అందరు అనుకుంటున్నారు. ఆరు సంవత్సరాలు పాటు నాలుగు భాగాలుగా ఈ ప్రాజెక్ట్ చేయనున్నారని, ఇందులో సూపర్ స్టార్స్ భాగం కానున్నారని టాక్స్ వినిపిస్తున్నాయి. రాజమౌళి, మహాభారతం చేస్తే ఇందులో రామ్ చరణ్, ఎన్టీఆర్ ఫిక్స్ అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఇక తాజాగా మరో నటుడి పేరు కూడా ఫిక్స్ అయింది. హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా దర్శక ధీర రాజమౌళితో పాటు హిట్ 1, 2 హీరోలు విశ్వక్ సేన్, అడివి శేష్ గెస్టులుగా హాజరయ్యారు. కలర్‌ఫుల్ గా జరిగిన వేడుకలో యాంకర్ సుమ సరదాగా నిర్వహించిన స్టేజి ఇంటర్వ్యూలో ఒక ఆసక్తికరమైన అప్డేట్ రాబట్టింది. రాజమౌళి డ్రీం ప్రాజెక్టు అయిన మహాభారతంలో నాని క్యారక్టర్ ఫిక్స్ అయిందని రూమర్స్ వస్తున్నాయి. ఇది నిజమేనా అని సుమ ప్రశ్నించింది. దానికి జక్కన్న ఠక్కున బదులిస్తూ నాని డెఫినిట్ గా ఉంటాడని చెప్పడంతో ప్రాంగణంలో ఉన్న ఆడియన్స్ చప్పట్లతో హొరెత్తిపోయింది. పాత్ర ఏంటనేది రివీల్ చేయకపోయిన, జక్కన్న డ్రీమ్ ప్రాజెక్ట్ లో నాని ఉంటాడని తెలియడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఇక నానికి ఏ పాత్ర అయితే బాగుంటుందో అని ఆలోచనలు చేస్తున్నారు.



# నేను కొందరిని బాధపెట్టాను

## శ్రుతి హాసన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

శ్రుతి హాసన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. కమల్ హాసన్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి వచ్చింది. కెరియర్ తొలినాళ్లలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఇబ్బందిపడ్డా.. ఆ తర్వాత వరుస హిట్‌లతో అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. అయితే, శ్రుతి సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితం, లవ్ ఎఫైర్స్, బ్రేక్‌లతో వార్తల్లో నిలుస్తుంది. ప్రేమ వ్యవహారాలు, బ్రేక్‌లపై సైతం ఎలాంటి దాపరికం లేకుండానే స్పందిస్తూ వస్తుంది. ఇటీవల ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గత సంబంధాలతో పాటు వాటి నుంచి నేర్చుకున్న పాఠాలు చేర్చుకున్నానని వ్యాఖ్యానించింది. ఇటీవల ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఆమె తన గత సంబంధాలు, వాటి వల్ల నేర్చుకున్న పాఠాలు, పశ్చాత్తాపంపై కీలక వ్యాఖ్యలు చేసింది. కొంతమంది చాలా విలువైన వ్యక్తులను బాధపెట్టానని.. అలా చేసి ఉండాల్సి కాదని అనిపిస్తుందని చెప్పింది. దానిపై ప్రస్తుతం బాధపడుతూ.. క్షమాపణలు కోరుంటానని తెలిపింది. మిగతా విషయాల్లో తనకు ఎలాంటి రిగ్రెట్స్ లేవని.. పలుసార్లు సరదాగా, అనాలోచితంగా ప్రవర్తించినా ఇతరులను బాధపెట్టడం మాత్రం బాధ కలిగిస్తుందని పేర్కొంది. తన లవర్ ఎఫైర్స్, బ్రేక్‌లపై స్పందిస్తూ.. అందరి జీవితంలో ఓ ప్రమాదకరమైన మాజీ ప్రేమికుడు ఉంటాడని.. అది తప్ప మిగతా బంధాలను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండానే ముగించినట్లు చెప్పింది. తనను చాలామంది ఇతను ఎన్నో బాయ్‌ఫ్రెండ్ అని ప్రశ్నిస్తుంటారని.. వారికి అది కేవలం ఒక నెంబర్ మాత్రమేనని.. తాను మాత్రం కోరుకున్న పొందడంలో విఫలమయ్యాదన్న దానికి గుర్తు మాత్రమేనని.. దాన్ని గురించి సిగ్గుపడనని, మనిషిగా కొంచెం బాధగా ఉంటుందని తెలిపింది.



# అల్లు అర్జున్- అట్లీ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్న క్రేజీ హీరోయన్

తెలుగు చిత్రం సీతారామంతో వెలుగులోకి వచ్చిన నటి మృణాల్ ఠాకూర్. అంతకుముందు హిందీ, మరాఠీ తదితర చిత్రాల్లో నటించారు. అయితే సీతారామం చిత్రం ఈమెని తెలుగులో స్టార్ హీరోయిన్‌ను చేసింది. అంతేకాకుండా తమిళం లోను పాపులర్ చేసింది. ఆమె నటించిన మరో చిత్రం హాయ్ నాన్న. నాని కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన నటించిన ఫ్యామిలీ స్టార్ చిత్రం నిరాశ పచడంతో క్రేజ్ ఒకసారిగా తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా మొఖం దాటేసాయి. అదేవిధంగా హిందీలో లస్ట్ స్టోరీస్ చిత్రంలో మెప్పించిన ఈ బ్యూటీ తెలుగులో అడివి శేష్ చిత్రం డెకాయిట్‌లో నటిస్తున్నారు. తాజాగా ప్రభాస్‌కు జతగా స్పిరిట్ చిత్రంలో నటించే అవకాశం తలుపు తట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ అమ్మడికి మరో లక్కీ సాంగ్స్ వరించిందని తాజాగా సామాజి మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప%-% 2 చిత్రంతో పాన్ ఇండియా మార్కెట్‌నే మార్చేశారు. ఆయనకు డైరెక్ట్‌గా కోలీవుడ్‌లొ ఒక చిత్రం చేయాలన్న కోరిక చాలాకాలంగా ఉంది. అలా లింగు స్వామి దర్శకత్వంలో చిత్రం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే, కారణాలు ఏమైనా ఆ చిత్రం సెట్ పైకి వెళ్లలేదు. అలాంటిది తాజాగా అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం చేయడానికి అల్లు అర్జున్ సిద్ధమయ్యారు. అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో భారీ బడ్జెట్లో రూపొందుతున్న ఈ చిత్రంలో ముగ్గురు కథానాయకలు ఉంటారని సమాచారం. అందుకోసం జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, దిశా పటానితో చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా ఈ లిస్టులో నటి మణాల్ ఠాగూర్ ముందు వరుసలో చేరినట్లు తెలిసింది. ఈమె ఈ క్రేజీ చిత్రంలో నటించడం దాదాపు ఖరారు అయినట్టు, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com